సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 15 । డిసెంబర్ । 2024



కష్టపడి చదవాలి

విద్యార్థులు కష్టపడి చదవాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్‌కుమార్ సూచించారు. 8లో ▸



ఒకే వక్కడు

సండే స్పెషల్

వైద్య రంగంలో దాదాపు నాలుగు దశాబ్దాలు పనిచేశారు.. అయినా ఇంకా ఏదో సాధించాలన్న తపన.. వైద్య రంగానికి స్వస్తి పలికారు.. కొత్తగా ఏదైనా ప్రయత్నించాలని ఆలోచించారు.. అక్కడక్కడ రీసెర్చ్‌లు చేశారు.. చివరికి వినూత్నంగా వక్కల సాగు వైపు అడుగులు వేశారు.. అద్భుత ఫలితాలు సాధించారు.. ఆయనే డా. విజయ్‌కుమార్ కొడాలి. తెలంగాణలోనే ఈ పంట సాగు చేస్తున్న ఒకే 'వక్క'డిగా నిలిచారు.

– దొడ్ల భాస్కర్ రెడ్డి
శంకర్‌పల్లి

డాక్టర్ టు ఫార్మర్

- వైద్య రంగం నుంచి వ్యవసాయం వైపు..
- వక్కల పంటలో సక్సెస్
- శంకర్‌పల్లి శివారులో సాగు
- ఆదర్శంగా నిలుస్తున్న డా.విజయ్‌కుమార్ కొడాలి



చెట్ల నుంచి తెంపిన వక్కలు

వివరాలు 8లో ▸



ఎండ బెట్టిన వక్కలను పరిశీలిస్తున్న విజయ్‌కుమార్

న్యూస్‌రీల్

నేడు త్రిశూల్ ప్రతిజ్ఞ దీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ప్రతినిధులు

హుడాకాంప్లెక్స్: విశ్వహిందూ పరిషత్, వివేకానంద జిల్లా బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఈనెల 15న (ఆదివారం) చేపట్టనున్న త్రిశూల్ ప్రతిజ్ఞ దీక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు తూము పురుషోత్తంరెడ్డి పిలుపునిచ్చారు. సరూర్‌నగర్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సరూర్‌నగర్ మండల గ్రౌండ్‌లో మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు త్రిశూల్ ప్రతిజ్ఞ దీక్ష జరగనుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మహాలక్ష్మీ దేవాలయం నుంచి గాంధీనగర్ కూడలి, సరూర్‌నగర్ చౌడీ మీదుగా మండల గ్రౌండ్‌లోకి సుమారు రెండు కిలోమీటర్ల పద సంచాలన్ ఉంటుందన్నారు. అనంతరం నిర్వహించే సమావేశానికి విశిష్ట అతిథిగా కశ్మీర్ ఫైల్స్ సినిమా నిర్మాత అభిషేక్ అగర్వాల్, ట్రెజరీ ఉద్యోగుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కె.విజయ్‌కుమార్, జనగణమన ఉత్సవ సమితి అధ్యక్షుడు గుమ్మళ్ల సత్యంజీ, వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్ హాజరవుతారని చెప్పారు. సమావేశంలో వీహెచ్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిమద్ది సుధాకర్, బజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ నవారు రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు జూనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

హుడాకాంప్లెక్స్: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 16న జూనియర్ బాలుర (70 కిలోల), బాలికల (65 కిలోల) జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రవికుమార్, ప్రధాన కార్యదర్శి పి.సుధాకర్ రెడ్డి తెలిపారు. ఎంపికైన బాలికల జట్టు ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు మేడ్చల్ జిల్లాలో జరిగే అంతర్ జిల్లా పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని చెప్పారు. బాలుర జట్టు ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు జనగామ జిల్లాలో జరిగే 50వ జూనియర్ అంతర్ జిల్లా కబడ్డీ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారన్నారు. ఆసక్తి గల వారు ఆధార్‌కార్డు తీసుకుని ఎంపికలో పాల్గొనాలని, ఇతర వివరాలకు 76619 92581, 90000 38272 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు పౌష్టికాహారం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు

తుర్కయంజాల్: విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కామన్ డైట్ మెనూ ప్రారంభించిదని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మున్సిపాలిటీ పరిధి కమ్మగూడలోని బాలికల మైనార్టీ గురుకుల పాఠశాలలో శనివారం ఆయన మెనూ ప్రారంభించారు. కార్యక్రమంలో అబ్దుల్లాపూర్ మెట్ తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ వెంకటమ్మ, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్య, ప్రిన్సిపాల్ వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన జెడ్పీ మాజీ చైర్‌పర్సన్



మహేశ్వరం: పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను జెడ్పీ మాజీ చైర్‌పర్సన్, కాంగ్రెస్ నాయకురాలు తీగల అనితారెడ్డి శనివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాతో పాటు మహేశ్వరం నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆమెకు మహేశ్ కుమార్ గౌడ్ సూచించారు. ప్రజా పాలన గురించి ప్రజలకు తెలియజేసి చైతన్యవంతులను చేయాలన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహేశ్వరం, కందుకూరు మండలాల్లో పార్టీ మెజార్టీ సీట్లు కైవసం చేసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించినట్లు అనితారెడ్డి తెలిపారు.



విద్యార్థులతో ముచ్చటిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

ఫ్యూచర్ గోల్ ఏమిటి?

విద్యార్థులపై సీఎం ప్రశ్నల వర్షం

- పండుగ వాతావరణంలో కామన్ డైట్ మెనూ ప్రారంభోత్సవం
- చిలుకూరు గురుకులంలో ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి
- గంటకు పైగా ఇక్కడే సందడిగా గడిపిన ముఖ్యమంత్రి
- విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

మొయినాబాద్: 'ఎక్కిడి నుంచి వచ్చావ్.. ఏ క్లాస్ చదువుతున్నావ్.. ఫ్యూచర్ గోల్ ఏమిటి.. కామన్ మెనూ, కాస్మోటిక్ చార్జీల పెంపుపై నీ ఫీలింగ్?' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థులపై ప్రశ్నల వర్షం కురిపించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అధ్యక్షతన శనివారం చిలుకూరు గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కామన్ డైట్ మెనూ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. గురుకులంలో మౌలిక సదుపాయాలు, వడ్డిస్తున్న ఆహారం, బోధన పద్ధతులపై ఆరా తీశారు. తొమ్మిదో తరగతి చదివే నందకిషోర్ 'చదువే జ్ఞానం.. చదువే ధైర్యం.. చదువే లక్ష్యం' అంటూ ఆలపించిన గీతానికి అబ్బురపోయారు. పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన మృదంగ విన్యాసాన్ని ఆసక్తిగా వీక్షించారు. వివిధ సంక్షేమ హాస్టళ్లలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ల్యాప్‌టాప్లు, చెక్కులు అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. సుమారు 38 నిమిషాల పాటు ఆయన ప్రసంగించారు. చదువుతోపాటు క్రీడలు ముఖ్యమని పేర్కొన్నారు. మల్టీ టాలెంటెడ్ హబ్‌లుగా గురుకులాలను తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. చిలుకూరు గురుకులంలో సుమారు గంటా 45 నిమిషాల పాటు సీఎం గడిపారు. కార్యక్రమంలో శాసన మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ ముఖ్య కార్యదర్శి శ్రీధర్, కార్యదర్శి అలుగు వర్షిణి, కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్, చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ గౌతమ్‌కుమార్, టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, మాజీ సర్పంచ్‌లు స్వరూప ఆంద్రూ, మల్లేష్‌యాదవ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాంరెడ్డి, నాయకులు మహేందర్ ముదిరాజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

టాలెంటెడ్ హబ్‌లుగా..

ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలను పోటీ ప్రపంచానికి దీటుగా తీర్చిదిద్దుతున్నాం. విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను గుర్తించి మల్టీ టాలెంటెడ్ హబ్‌లుగా తయారు చేస్తున్నాం. 3,500 గురుకులాల్లో కామన్ మెనూ ప్రారంభించడం అభినందనీయం. అంతర్జాతీయ స్థాయిలో నియోజకవర్గానికి ఒకటి ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గురుకులాల్లో 8 వేల ఉపాధ్యాయ పోస్టులు, డీఎస్సీ ద్వారా మరో 11 వేలు పోస్టులు భర్తీ చేశాం.

– శ్రీధర్, సోషల్ వెల్ఫేర్ ముఖ్య కార్యదర్శి

హాస్టల్‌లోనే చదివా..

నేను కూడా సంక్షేమ హాస్టల్‌లోనే చదువుకున్నా. ఆ రోజుల్లో కడుపునిండా అన్నం కూడా దొరికేది కాదు. ప్రస్తుతం ఆ పరిస్థితిలేదు. సన్న బియ్యంతో అన్నం వడ్డిస్తున్నాం. దళిత హాస్టల్‌లో కామన్ మెనూ ప్రారంభించడం, సీఎం ముఖ్యఅతిథిగా రావడం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనం. చేవెళ్ల నియోజకవర్గం నగరానికి సమీపంలో ఉంది. రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. పంచాయతీ రోడ్లకు రూ.300 కోట్లు, ఆర్ అండ్ బీ రోడ్లకు రూ.200 కోట్లు ఇవ్వండి. మెరుగు పర్చుకుంటాం.

– కాలె యాదయ్య, చేవెళ్ల ఎమ్మెల్యే

కార్పొరేట్‌కు దీటుగా ..

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల, పాఠశాలలను కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా తీర్చిదిద్దుతాం. భవిష్యత్తులో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. విద్యార్థులను ప్రోత్సహిస్తాం. ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి విద్యను అందించాలి. విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి.

– పట్నం మహేందర్‌రెడ్డి, శాసనమండలి చీఫ్‌విప్

మత్తుతో చిత్తు కావొద్దు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎస్పీ సాయి చైతన్య

మహేశ్వరం: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, కష్టపడి చదవాలని తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎస్పీ సాయి చైతన్య పేర్కొన్నారు. శ్రీశైలం జాతీయ రహదారి పక్కన మహేశ్వరం గేటు సమీపంలోని ఎంజేపీటీ బీసీ గురుకుల పాఠశాల, కళాశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. విద్యార్థుల కదలికలు, వారి ప్రవర్తనను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్లలోని నవాబుపేట బీసీ గురుకులంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న దివ్య దేవరాజన్

విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి

సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్

చేవెళ్ల: గురుకులాల్లో విద్యాప్రమాణాల మెరుగుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, ఇందులో భాగంగానే కామన్ డైట్ మెనూ తీసుకువచ్చిందని స్త్రీ, శిశు సంక్షేమశాఖ, సెర్ప్ సీఈఓ దివ్యదేవరాజన్ అన్నారు. మండలంలోని గొల్లపల్లి సమీపంలో ఉన్న నవాబుపేట బీసీ గురుకుల పాఠశాలలో శనివారం కామన్ డైట్ మెనూను ఆమె వికారాబాద్ ట్రెయినీ కలెక్టర్ ఉమా హారతితో కలిసి ప్రారంభించారు. పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అందించే మెనూ ఎంతో బాగుందని ఇదే విధంగా కొనసాగించాలని సూచించారు. పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ముఖ్యఅతిథులుగా వచ్చిన ఐఏఎస్ అధికారుల చిత్రాలను గీసి వారికి బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ రవికుమార్, ఎంపీడీఓ హిమబిందు, ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

చేవెళ్లలోని మియాపూర్ గుకులంలో..

చేవెళ్లలో కొనసాగుతున్న మియాపూర్ ఎంజేపీటీ బీసీ గురుకులంలో కామన్‌డైట్ మెనూను జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డీసీ నాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి డాక్టర్ దేవేందర్‌రెడ్డి, ఎంపీడీఓ హిమబిందు, డీఈఈ హారిక, కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సౌకర్యాలను వినియోగించుకోవాలి

మున్సిపల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్



విద్యార్థినులతో మాట్లాడుతున్న దానకిషోర్

కందుకూరు: ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను ఉపయోగించుకుని, బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, గవర్నర్ ముఖ్య కార్యదర్శి దానకిషోర్ విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వం వసతి గృహాల్లోని విద్యార్థులకు అమలు చేస్తున్న న్యూ కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని గూడూరు గేట్ వద్ద ఉన్న ఎస్సీ బాలికల గురుకులం సందర్శించారు. భవనంలోని తరగతులన్నీ కలియతిరిగి విద్యార్థినులతో మమేకమయ్యారు. వాళ్ల టార్గెట్ ఏమిటి? భవిష్యత్‌లో ఏం కావాలనుకుంటున్నారు? వాళ్లలో ఉన్న నైపుణ్యాలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. పుట్టిన రోజు ఉన్న విద్యార్థినులతో కేక్ కట్ చేయించారు. అనంతరం న్యూకామన్ డైట్ మెనూను ప్రారంభించి విద్యార్థినులు, వారి తల్లిదండ్రులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా దాన కిషోర్ మాట్లాడుతూ.. తాను హాస్టల్‌లో చదివే ఈ స్థాయికి చేరుకున్నానని అన్నారు. ప్రభుత్వం చాలా చేస్తోందని, విద్యార్థులు కష్టపడి చదివి ప్రయోజకులు కావాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ గోపాల్, ఎంఈఓ నర్సింహ, ప్రిన్సిపాల్ లక్ష్మి, సీడీపీఓ శాంతిశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డైట్, కాస్మొటిక్ చార్జీలకు రూ.474 కోట్లు

- రాష్ట్ర వ్యాప్తంగా 8లక్షల మంది విద్యార్థులకు లబ్ధి
- రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్
- పలు ప్రభుత్వ హాస్టళ్ల సందర్శన



విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్

ఇబ్రహీంపట్నం: పౌష్టికాహార లోపం విద్యార్థుల ఎదుగుదలకు ఆటంకం కావద్దని, నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించేందుకు ప్రభుత్వం డైట్, కాస్మొటిక్ చార్జీలను పెంచిందని ఇందు కోసం అదనంగా రూ.474 కోట్లు వెచ్చిస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ అన్నారు. చర్లపటేల్‌గూడలోని రాజమహేంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న చాంద్రయణగుట్ట, ఖైరతాబాద్ సాంఘిక సంక్షేమ గురుకుల స్కూల్, హాస్టళ్లను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పేరెంట్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రంలోని హాస్టళ్లలో చదువుతున్న సుమారు 8 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఇకనుంచి ఫుడ్ సేఫ్టీ అధికారులు వసతి గృహాల్లో ఎప్పటికప్పుడు భోజనాన్ని తనిఖీ చేస్తారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యారంగంపై ప్రత్యేకంగా దృష్టిసారించారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో 28, రెండో విడతలో 54 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలను నెలకొల్పనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అనంతరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, స్పెషల్ ఆఫీసర్ పల్లవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి

రాష్ట్ర సాంకేతిక విద్యా కమిషనర్ శ్రీదేవసేన

అబ్దుల్లాపూర్‌మెట్ : విద్యార్థుల అభిరుచులను తెలుసుకుని, వారిని తల్లిదండ్రులు ప్రోత్సహించాలని రాష్ట్ర సాంకేతిక విద్యా కమిషనర్ శ్రీదేవసేన సూచించారు. గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో మెస్ చార్జీలు పెంపు, ఇతర సౌకర్యాల కల్పనలో భాగంగా శనివారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలో కొనసాగుతున్న మహాత్మాజ్యోతి పూలే బాలుర గురుకుల కళాశాలను మిషన్ భగీరథ ఈఈ రాజేశ్వర్, డీఐఈఓ వెంక్యా నాయక్‌తో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను, వంట గది, ఆహార పదార్థాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. భోజనం నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీవాణి, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు. కాగా, మండల పరిధిలోని కొత్తగూడెం శివారులో ఉన్న మహాత్మా పూలే బాలుర వసతి గృహాన్ని (చిక్కడపల్లి శాఖ) హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్ శ్రీవత్స, రాష్ట్ర మత్స్యశాఖ అదనపు డైరెక్టర్ నర్సింహారావు సందర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు గర్వించేలా ఎదగాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తెలంగాణ పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ సునీతా మోహన్

తెలంగాణ పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ సునీతా మోహన్

కడ్తాల్: ప్రభుత్వ పాఠశాలలు, విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులు దేనికి తీసిపోరని.. గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశగా అడుగులు వేయాలని.. తల్లిదండ్రులు గర్వించేలా ఉన్నత స్థాయికి ఎదగాలని తెలంగాణ పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ సునీతా మోహన్ ఆకాంక్షించారు. డైట్ చార్జీల పెంపు, కామన్ డైట్ మెనూ ప్రారంభోత్సవంలో భాగంగా శనివారం మండల పరిధిలోని మైసిగండి బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. కార్యక్రమానికి సునీతా మోహన్‌తో పాటు ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ హాజరయ్యారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న కామన్ డైట్ బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం బాలరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యాల యాల్లో చదువుతున్న విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఏటీడీఓ వెంకటయ్య, మిషన్‌భగీరథ డీఈ రామకృష్ణ, వార్డెన్ బాల్‌రాజ్, డీటీ ఆదిత్య, ఆర్‌ఐ వహీద్, సీఐ శివప్రసాద్, ఎస్‌ఐ వరప్రసాద్ పాల్గొన్నారు.



సోలార్ పరికరం ద్వారా వక్కలను ఎండబెడుతున్న దృశ్యం

ఒకే వక్కడు



సండే స్పెషల్

శంకర్‌పల్లి: నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన విజయ్‌కుమార్ కొడాలి బోధన్‌లో ఇంటర్, ఉస్మానియాలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. 1979లో తన స్నేహితురాలు, క్లాస్‌మేట్ డా.విజయలక్ష్మి(గైనకాలజిస్ట్)ని ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇద్దరూ డాక్టర్లే కావడంతో తొలుత విదేశాలకు వెళ్దామనుకున్నారు. మళ్లీ ఆలోచించి ఇక్కడ హాస్పిటల్ పెట్టి సేవలందించాలన్న నిర్ణయానికి వచ్చారు. ఐడీపీఎల్ బాలానగర్ వద్ద కొడాలి నర్సింగ్ హోమ్‌ను స్థాపించారు. అది కొన్ని రోజుల్లోనే అంచలంచెలుగా వృద్ధి చెందడంతో 60 పడకల ఆస్పత్రిగా మార్చారు. కొన్ని వేల మందికి చికిత్సలు అందించారు.

విరామం తర్వాత ఇలా..

దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా వైద్య రంగంలో సేవలందించిన డా.విజయ్‌కుమార్ ఆ రంగంలో విశ్రాంతి తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. తండ్రి వెంకటేశ్వరరావు వ్యవసాయ విద్యార్థి కావడంతో మందు నుంచి వ్యవసాయంపై మక్కువ ఎక్కువ. దీంతో ఆ రంగం వైపు దృష్టి సారించాలనుకున్నారు. ఓసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లాలోని ఏలూరులో ఉన్న తన స్నేహితుడు విజయ సారథి దగ్గరకు వెళ్లాడు. ఆయన అప్పటికే 30 ఏళ్ల నుంచి వక్కల సాగు చేస్తుండడంతో విజయ్‌కుమార్ సైతం ఆసక్తి కనబరిచారు. ఇందులో భాగంగా శంకర్‌పల్లి మండలం మాసానిగూడలో 2008లో తాను కొనుగోలు చేసిన 9 ఎకరాలను ఎంచుకున్నారు.

మెలకువలు తెలుసుకుని..

తొమ్మిది ఎకరాల్లో మొదటగా నాలుగెకరాల్లో వక్క సాగు చేసేందుకు నిర్ణయించుకున్నారు. ముందుగా పంట సాగులో మెలకువలు తెలుసుకున్నారు. మొక్క పెరిగేంత వరకు ఎండ ఎక్కువ పడకుండా 2015లో మల్బరీ మొక్కలు నాటారు. అవి కొంత పెద్దయిన తర్వాత 2017లో ఏలూరు నుంచి రూ.30 చొప్పున 1,200 వక్క మొక్కలను తెచ్చారు. ఒక్కో మొక్కకు రూ.30 చొప్పున ఇచ్చి నాటించారు. ఎకరంలో 700 వరకు నాటే అవకాశం ఉన్నా 300 మొక్కలు మాత్రమే నాటించారు. ఒక్కో మొక్క మధ్య 12 ఫీట్ల దూరం, 8 ఫీట్ల వెడల్పు ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. తర్వాత వాటికి సహజసిద్ధంగా లభించే ఆముదం పిండి, ఆవాల పిండి, వేప గింజలు పొడి, వర్మికంపోస్టు ఎరువు, తక్కువ మోతాదులో రసాయన ఎరువులు వినియోగించారు. డ్రిప్ పద్ధతి ద్వారా నీటిని అందిస్తున్నారు. తొలుత వేసిన మల్బరీ వేప చెట్లను కత్తిరించి అమ్మేయగా రూ.4 లక్షల ఆదాయం వచ్చింది. తర్వాత వాటి స్థానంలో కొబ్బరి మొక్కలు నాటారు. వచ్చే ఏడాది నుంచి కొబ్బరికాయల ఉత్పత్తి జరిగే అవకాశం ఉంది.

మార్కెట్‌లో కిలో రూ.350పైనే..

ఒక్కో మొక్కను తెచ్చి నాటేందుకు రూ.60, డ్రిప్ కోసం రూ. 1.50 లక్షలు, ఏడాదికి రూ.50వేల సేంద్రియ ఎరువులు, కూలీల ఖర్చు ఉంటుందని డా.విజయ్ కుమార్ తెలిపారు. సెప్టెంబర్ నుంచి పంట ప్రారంభమై ఫిబ్రవరిలో అయిపోతుందన్నారు. వక్కలను తీసి ఎండ బెట్టడానికి సోలార్ పరికరాలను వినియోగిస్తున్నామని దీనికి పది రోజులు పడుతుందని, ఈ పరికరాలు లేకపోతే నెల రోజుల పడుతుందని చెప్పారు. మొదటి ఏడాది సుమారు 1,500 కిలోల వక్కలు పండాయని, వాటిని పశ్చిమ గోదావరి జిల్లా అంబాజీపేటలో కిలో రూ.160 చొప్పున అమ్మినట్లు తెలిపారు. వారు వాటిని శుద్ధి చేసి కేరళ, తర్వాత విదేశాలకు ఎగుమతి చేస్తారన్నారు. తాను పూర్తి స్థాయిలో వక్కలు తీయనందున (శుద్ధి) రూ.160 వచ్చిందని.. పూర్తి స్థాయిలో పొట్టు వేరు చేసి, వక్కలు మాత్రమే అమ్మితే బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.350- రూ.400 పలుకుతుందన్నారు. మొదటి ఏడాది తనకు రూ.2.50 లక్షల ఆదాయం వచ్చిందని, ఈ ఏడాది మరో రూ.3లక్షల నుంచి రూ.4లక్షలు వచ్చే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

అంతర పంటగా సుగంధ ద్రవ్యాలు

వక్క తోటలోనే పలు సుగంధ ద్రవ్యాలు సాగు చేస్తున్నారు. మిరియాలు, యాలకులు, జాజికాయ, జాపత్రి, లవంగాలు, అల్లంతో పాటు ఆపిల్, ద్రాక్ష, బ్లూ బెర్రీ, బ్లాక్ బెర్రీ, అవకాడో, మ్యాంగో, జామ వంటి పండ్ల మొక్కలు పెంచుతున్నారు. మరో ఏడాదిలో పండ్లు చేతికందుతాయి.

నాటిన ఆరేళ్ల నుంచి పంట

వక్క పంట చేతికి రావడానికి మొదటగా ఆరేళ్ల సమయం పడుతుంది. ఆరేళ్లపాటు మొక్కకు కావాల్సిన పోషకాలు సమృద్ధిగా అందించాల్సి ఉంటుంది. తర్వాత 50 ఏళ్ల వరకు దాని జీవితకాలం ఉంటుంది. 2017లో మొక్కలు నాటితే 2023లో పంట 40శాతం మేర చేతికి వచ్చిందని.. సుమారు 1,500 కిలోలు ఉత్పత్తి అయినట్లు విజయ్ కుమార్ తెలిపారు. రెండో ఏడాది 60 నుంచి 70 శాతం, మూడో ఏడాది 70 నుంచి 90 శాతం, నాలుగో ఏడాది 100 శాతం పంట వస్తుందన్నారు. మొక్క నాటిన నుంచి పూర్తి స్థాయిలో పంట రావడానికి పదేళ్ల సమయం పడుతుందన్నారు.

సాగు చాలా సులువు

రాష్ట్రంలో అవకాశం ఉన్న రైతులంతా వక్క పంటను సాగు చేసుకోవచ్చు. దీన్ని పండించడం చాలా సులువు. ఆసక్తి గలవారికి మెలకువలు నేర్పేందుకు సిద్ధం. ఇప్పటికే చాలామంది వచ్చి తెలుసుకొని వెళ్తున్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించి, రైతులకు తోడ్పాటు అందించాలి.

– డాక్టర్ విజయ్‌కుమార్





చెట్టు నుంచి వక్కలను కోస్తున్న దృశ్యం

గురుకులాల్లో నాణ్యమైన విద్య

మొయినాబాద్‌రూరల్: గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని హైదరాబాద్ ఉమెన్స్ డీసీపీ లావణ్య అన్నారు. గురుకులాల్లో నూతన డైట్ ప్రారంభోత్సవంలో భాగంగా మండల పరిధిలోని బంట్వారం సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలను శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలోని భోజనశాలను పరిశీలించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థులకు సంబంధించిన డైట్ మెనూ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యపై దృష్టి సారిస్తారని, విజ్ఞానవంతులుగా ఎదుగుతారని ఐఎస్ఎఫ్ ఓఎస్డీ రెవెన్యూ శాఖ అధికారి శ్రీలక్ష్మి, మేడ్చల్ ఐపీఎస్ అధికారి ఎస్.కోటిరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ చేవెళ్ల బాలికల పాఠశాల, కళాశాలలో శనివారం డైట్ మెనూ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం గురుకులాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీడీపీవో జోనల్ అధికారి నిర్మల, ప్రిన్సిపాల్ మాలతి, వైస్ ప్రిన్సిపాల్ వినోలియా తదితరులు పాల్గొన్నారు.



గురుకుల బాలికల పాఠశాలలో డైట్ మెనూ ప్రారంభిస్తున్న ఉమెన్ డీసీపీ లావణ్య తదితరులు

విద్యార్థులు కష్టపడి చదవాలి

యాచారం: హాస్టళ్లలో సౌకర్యాలు కల్పించే బాధ్యత మాది.. ఉన్నత లక్ష్యంతో కష్టపడి చదువుకునే బాధ్యత మీది అని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఎస్‌లో శనివారం ఆయన మెస్ చార్జీల పెంపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వసతి గృహాల్లో చదువుకునే పేద విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించి, మెరుగైన విద్య అందించేందుకు సర్కార్ ప్రత్యేక కృషి చేస్తోందని తెలిపారు. విద్యార్థులే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు హాస్టల్‌లోని వంట గది, భోజన శాల, మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశీలించారు. అనంతరం వివిధ రకాల క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్, జిల్లా సంక్షేమ అధికారిణి సంధ్యారాణి, ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, సీఐ నర్సింహరావు, ఎంపీఓ శ్రీలత, హాస్టల్ ప్రిన్సిపాల్ సోనికుమారి పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న లోకేష్ కుమార్

మెరుగైన బోధనలో రాజీపడొద్దు

వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మెరుగైన విద్యను అందించే విషయంలో ఉపాధ్యాయులు రాజీ పడొద్దని రాష్ట్ర జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీ మహేశ్ దత్త ఏకే సూచించారు. మండల కేంద్రంలోని టీఎస్‌డబ్ల్యూఆర్ఐఈఎస్‌లో శనివారం మెస్ చార్జీల పెంపు కార్యక్రమానికి హాజరయ్యారు. వసతి గృహంలోని వంటగది, కూరగాయలు నిల్వ చేసే గది, విద్యార్థుల తరగతి గదులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప, ప్రిన్సిపాల్ నాగేంద్ర పాల్గొన్నారు.

విద్యార్థులు బాగుంటేనే.. మంచి ఫలితాలు

ఇబ్రహీంపట్నం: విద్యార్థులు మానసికంగా, శారీరకంగా బాగుంటేనే మంచి ఫలితాలను సాధిస్తారని సీనియర్ ఐఏఎస్ అధికారి, ఎంసీ ఆర్‌హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ జనరల్ శశాంక్ గోయల్ అన్నారు. ఇబ్రహీంపట్నం నల్లకంచెలోని బాలికల గురుకుల విద్యాలయంలో శనివారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి డైట్, కాస్మొటిక్ చార్జీల చార్ట్‌ను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల మున్సిపల్ చైర్ పర్సన్స్ కప్పరి స్రవంతి, మర్రి నిరంజన్‌రెడ్డి, గడ్డి అన్నారం ఫ్రూట్ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూధన్‌రెడ్డి, తహసీల్దార్ సునీతరెడ్డి, కౌన్సిలర్ భర్తకి జగన్, ప్రిన్సిపాల్ లీలావతి ఉన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న శశాంక్ గోయల్, ఎమ్మెల్యే రంగారెడ్డి

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతి



ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నేతలు

యాచారం: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నేతలు కోరారు. ఈ మేరకు శనివారం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో కామన్ డైట్ మెనూను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేతలు లోకేష్ కుమార్‌ను కలిశారు. పంచాయతీ సిబ్బంది బకాయిలు వెంటనే చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. వారిని క్రమబద్ధీకరించడంతో పాటు బీమా, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. సిబ్బందికి మొత్తం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, మృతి చెందిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని పేర్కొన్నారు. లేని పక్షంలో ఈ నెల 20వ తేదీ తరువాత నిరవధిక సమ్మె చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు బ్రహ్మయ్య, కృష్ణ, ఎస్.చందునాయక్, శంకరయ్య, శరణం, ప్రవీణ్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల బస్టాండ్‌లో వ్యక్తి మృతి

కూర్చున్న చోటే ప్రాణం వదిలిన వైనం



బుచ్చయ్య మృతదేహం

చేవెళ్ల: బస్ స్టేషన్‌లోని సోఫాలో కూర్చున్న చోటే వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన చేవెళ్ల బస్టాండ్‌లో శనివార ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చేవెళ్ల మండలం, ఆలూరు అనుబంధ గ్రామమైన వెంకన్నగూడకు చెందిన ధన్నారం బుచ్చయ్య(55) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శుక్రవారం ఉదయం ఇంట్లోనుంచి పొలానికి వెళ్లి, తిరిగి రాలేదు. తెలిసిన వారిని అడగగా వికారాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్తున్నట్లు చెప్పారు. శుక్రవారం ఇంటికి రాలేదు. ఇదిలా ఉండగా.. శనివారం చేవెళ్ల బస్టాండ్‌లో కూర్చున్న చోటే బుచ్చయ్య మృతిచెందాడు. ఈ విషయాన్ని చాలా సేపటి వరకు ఎవరూ గమనించలేదు. తెలిసిన వారు వెళ్లి పిలిచినా పలకకపోవడంతో కంట్రోలర్, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య, కూతురు ఇద్దరు కుమారులు ఉన్నట్లు తెలిపారు. కొడుకు నరేందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.